RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ | ఎడిటర్ : చెరుకు ఉపేందర్ | బుధవారం | 28 -02 - 2024
సంపుటి: 1 | సంచిక : 281 | పేజీలు : 4 | వెల : 5/-

**ఆరు గ్యారంటీలే మాకు భగవద్గీత, ఖురాన్, బైబిల్**



4వ



# లైఫ్ సైన్సెస్‌కు హైదరాబాద్ కేరాఫ్

ప్రపంచంలో కొవిడ్‌కు 3 వ్యాక్సిన్లు వచ్చాయి. వాటిలో ఒక వ్యాక్సిన్ అందించిన ఘనత మన హైదరాబాద్‌కు దక్కింది. భాగ్యనగరం ఎన్నో పరిశోధ నలకు నిలయంగా ఉంది. 20 ఏళ్లుగా బయో ఆసియా సదస్సులు హైదరాబాద్ ను ఉన్నత స్థానంలో నిలిపాయి.

హైదరాబాద్, ప్రభాతసూర్యుడు : భాగ్యనగరం ఐటీ, సాఫ్ట్ వేర్ రంగాలతో పాటు లైఫ్ సైన్సెస్ కు రాజధాని అనడంలో ఎలాంటి సందేహం లేదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. హెచ్ఐసీసీ వేదికగా జరుగుతున్న 21వ బయో ఆసియా - 2024 సదస్సులో సీఎం, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పాల్గొన్నారు. జీవ వైవిధ్యం, సాంకేతిక రంగంలో విప్లవాత్మక మార్పులపై చర్చించారు. అలాగే, ఔషధ రంగంలో ఆవిష్కరణలు, ఔషధ పరికరాల ప్రోత్సాహకాలపైనా చర్చలు జరిపారు. 'కొవిడ్ అనంతరం ప్రజలు ఆరోగ్యంపై దృష్టి సారించారు. ప్రపంచంలో కొవిడ్ కు 3 వ్యాక్సిన్లు వచ్చాయి. వాటిలో ఒక వ్యాక్సిన్ అందించిన ఘనత మన హైదరాబాద్ కు దక్కింది. భాగ్యనగరం ఎన్నో పరిశోధనలకు నిలయంగా ఉంది. 20 ఏళ్లుగా బయో ఆసియా సదస్సులు హైదరాబాద్ ను ఉన్నత స్థానంలో నిలిపాయి. జాతీయ, అంతర్జాతీయ స్టార్టప్ కంపెనీలకు ప్రోత్సాహం అందించడంతో పాటు ఎంఎస్ఎంఈలను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం దృష్టి సారించింది.' అని పేర్కొన్నారు. ఫార్మా రంగంలో సవాళ్లను తాను అర్థం చేసుకోగలనని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఇటీవల కొందరు ఫార్మా రంగ ప్రతినిధులతో సమావేశమయ్యానని.. వారి సమస్యలు వివరించారని చెప్పారు. ఫార్మా రంగానికి ప్రభుత్వం తరఫున పూర్తి బాసటగా నిలుస్తామని.. '

మిగతా 2వ పేజీలో...

# పోనూ రానూ లేదు!

## పక్క రాష్ట్రాల నేతలకు కేసీఆర్ దూరం



- పొరుగు రాష్ట్రాల్లో బీఆర్ఎస్ తిరోగమనం
- మహారాష్ట్రలో ఇప్పటికే పలువురు రాజీనామా
- ఏపీలోనూ అదే పరిస్థితికి 'కారు' భవితవ్యం
- కేసీఆర్ అక్కడి నేతల ఫోన్ కూడా ఎత్తడం లేదట!



హైదరాబాద్, ప్రభాతసూర్యుడు : కేసీఆర్..అప్పట్లో మహారాష్ట్ర వెళ్లారు. అక్కడ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు.. ఆ రాష్ట్రానికి చెందిన ఓ వ్యక్తిని రాజకీయ సలహాదారుగా నియమించుకున్నారు. ఏకంగా క్యాబినెట్ ర్యాంకు కట్టబెట్టారు. అక్కడితో ఆగలేదు. కర్ణాటక చుట్టి వచ్చారు. ఏపీలో పార్టీని ప్రారంభించారు. తోట చంద్రశేఖర్ అనే వ్యక్తిని రాష్ట్ర అధ్యక్షుడిని చేశారు. వైజాగ్ స్టీల్ బిడ్ లో సింగరేణిని భాగస్వామ్యం చేస్తామని ప్రకటించారు. ఇవి మాత్రమే కాదు టీఆర్ఎస్‌ను బీఆర్ ఎస్ చేసి ఢిల్లీలో పార్టీ కార్యాలయాన్ని నిర్మించారు.. అట్టహాసంగా ప్రారంభించారు. ఇంత ఘనంగా అన్ని చేస్తే ఏం జరిగింది? పార్టీ పుట్టిన తెలంగాణలోనే ఓడిపోయింది.. తెలంగాణ మోడల్ అని ప్రచారం చేసుకుంటే ప్రజల నుంచి తిరస్కారం ఎదురైంది. భారత రాష్ట్ర సమితి పరిస్థితి జాతీయ స్థాయిలో ఖతం అయినట్టే కనిపిస్తోంది. తెలంగాణను కేంద్రంగా చేసుకొని అప్పట్లో భారత రాష్ట్ర సమితి దేశం మొత్తం విస్తరించాలని కేసీఆర్ కలలుగన్నారు. ఇందుకోసం కొంత ప్రయత్నం చేశారు. చాలావరకు డబ్బు ఖర్చు పెట్టారు. తెలంగాణకు పొరుగున ఉన్న మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలపై ఎక్కువగా దృష్టి సారించారు. ప్రభుత్వ డబ్బులతో అక్కడి పత్రికలకు జాకెట్ యాడ్స్ ఇచ్చారు. ప్రభుత్వ ఖర్చులతో చాలాసార్లు ఆ రాష్ట్రాలకు వెళ్లి వచ్చారు. ముఖ్యంగా మహారాష్ట్రలో పలుమార్లు బహిరంగ సభలు నిర్వహించారు. మహారాష్ట్రలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసి కొన్నిచోట్ల విజయం సాధించినట్లు చెప్పుకున్నారు. తెలంగాణ రాష్ట్ర సమితిని భారత రాష్ట్ర సమితిగా మార్చారు. కేసీఆర్ అనుకున్నట్టు అన్నీ జరిగితే కథ వేరుగా ఉండేది. కానీ తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోవడంతో ఒక్కసారిగా పరిస్థితి మారిపోయింది. దీంతో మిగతా రాష్ట్రాల్లో పార్టీ పరిస్థితి దారుణంగా పడిపోయింది. అందుకే కేసీఆర్ అటు మహారాష్ట్ర,

మిగతా 2వ పేజీలో...



3వ

**నేటి నుంచి ఇంటర్ పరీక్షలు**

నిమిషం నిబంధన అమలు



3వ

**గగన్‌యాన్ గ్యాంగ్ ఖరారు**

పేర్లు ప్రకటించిన మోదీ



4వ

**కదలని కడెం**

ముందుకు సాగని పనులు



4వ

**మేడారం పూజారి మృతి**

గుండెపోటుతో మరణం

# మార్చి 1న చలో మేడిగడ్డ

## బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు



కాళేశ్వరం అంటే మేడిగడ్డ కాదు మూడు బరాజ్‌లు. కాళేశ్వరం అంటే 15 రిజర్వాయర్లు, 21 పంప్‌హౌస్‌లు, 203 కిలోమీటర్ల సొరంగాలు, 1531 కిలోమీటర్ల ప్రవాహ కాలువలు. కాళేశ్వరం అంటే 141 టీఎంసీల స్టోరేజ్ కెపాసిటీ..240 టీఎంసీల వినియోగం. వీటన్నింటి సమగ్ర సమాహారమే కాళేశ్వరం ప్రాజెక్టు.

హైదరాబాద్ - ప్రభాతసూర్యుడు : మార్చి ఒకటి నుంచి చలో మేడిగడ్డ కార్యక్రమానికి పిలుపునిచ్చినట్లు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామా రావు ప్రకటించారు. 150-200 మంది బీఆర్ఎస్ ప్రతినిధులతో కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ భవన్ నుంచి మేడిగడ్డ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో భాగంగా తొలిరోజు కాళేశ్వరం వెళ్తామన్నారు. ఈ కార్యక్రమం ద్వారా కాళేశ్వరం ప్రాజెక్టు సమగ్ర స్వరూపాన్ని తెలంగాణ ప్రజలతో పాటు ఆరోపణలు చేస్తున్న వారికి చూపిస్తామన్నారు. ప్రజలకు వాస్తవాలు తెలిపేందుకే మేడిగడ్డకు వెళ్తున్నట్లు తెలిపారు. కాళేశ్వరం ఏంటే ఏంటో సజీవంగా చూపిస్తామన్నారు. విడతల వారీగా కాళేశ్వరం ప్రాజెక్టును సమగ్రంగా సందర్శిస్తామన్నారు. సజీవంగా చూపెట్టాలని.. 'అసలు కాళేశ్వరం అంటే ఏమిటీ..? రాష్ట్ర ప్రజలకు ఈ రోజు చెప్పదలచుకున్నాం.. దాంతో పాటు కొందరు తెలిసీ తెలియక

మిగతా 3వ పేజీలో...

# సగం మందికే ఫ్రీ గ్యాస్

హైదరాబాద్, ప్రభాతసూర్యుడు : తెలంగాణలో కాంగ్రెస్ సర్కార్.. మరో రెండు గ్యారంటీల అమలుకు కసరత్తు చేస్తోంది. ఫిబ్రవరి 27న 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500 లకే సబ్సిడీ సిలిండర్ అందించనున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఈమేరకు అధికారులు ఏర్పాట్లు చేశారు. అభయహస్తం దరఖాస్తులు స్వీకరించిన ప్రభుత్వం వాటి ఆధారంగానే కొత్త గ్యారంటీలు అందించనున్నట్లు ప్రకటించింది. ఇందులో రేషన్ కార్డుదారులకు మాత్రమే సబ్సిడీ గ్యాస్, ఉచిత విద్యుత్ పథకం వర్తిస్తుందని సీఎం ప్రకటించారు. రాష్ట్రంలో 90 లక్షల రేషన్‌కార్డులు ఉన్నాయి. ఇందులో 40 లక్షల మంది మాత్రమే సబ్సిడీ గ్యాస్, రూ.500 గ్యాస్ సిలిండర్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. మిగతా వారు

మిగతా 2వ పేజీలో...



మహిళల కళ్లలో ఆనందం చూడాలనే రూ.500 గ్యాస్ పథకాన్ని ప్రారంభిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. పేదలకు పథకాలు చేరేలా అధికారులు విధి విధానాలు రూపొందించా రు. ఆర్థిక నియంత్రణ పాటిస్తూ పేదలకు ఇబ్బంది కలగకుండా పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు.

## కేటీఆర్ చుట్టూ వైఫైలా ఈగో

### రోజా ఐటం రాణి : బండ్ల గణేష్

హైదరాబాద్ - ప్రభాతసూర్యుడు : తండ్రి పేరు అడ్డు పెట్టుకోనే కేటీఆర్ రాజకీయాల్లోకి వచ్చారు. కేసీఅర్ అబ్బాయిగా తప్పా కేటీఆర్ కి ఏ గుర్తింపు లేదని సినీ నిర్మాత బండ్ల గణేష్ అన్నారు. రేవంత్ పోరాట యోధుడు. బీఆర్ఎస్ పెట్టిన చిత్ర హింసలు, మానసిక క్షోభ అధిగమించి ముఖ్యమంత్రి అయ్యారు. కేటీఆర్ చుట్టూ వైఫై లాగా ఈగో ఉంటుంది. రేవంత్ సీఎం కావడంతో కేటీఆర్ భాధపడుతున్నాడు. కేటీఆర్ రాజకీయ పరంగా

మిగతా 4వ పేజీలో...



# కవితకు షాక్ తప్పదా?

హైదరాబాద్, ప్రభాతసూర్యుడు : ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత కు మరో బిగ్ షాక్ తగలనుంది. ఇటీవల సీబీఐ ఇచ్చిన నోటీసుల ప్రకారం కవిత సోమవారం సీబీఐ ముందు విచారణకు హాజరు కావాల్సి ఉంది. కానీ ఆమె విచారణకు రాలేనంటూ ట్విస్ట్ ఇచ్చారు. దీంతో న్యాయవిచారణకు దిగిన సీబీఐ అధికారులు.. లీగల్ అడ్వయిజ్ తీసుకొని తదుపరి కార్యాచరణకు దిగాలని భావిస్తున్నారు. అయితే ఈ ఎపిసోడ్ తో రాజకీయంగా ఎన్నో అనుమానాలు తెరపైకి వస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కవితను ఈడీ విచారణ పేరుతో హడావుడి చేస్తే.. మరో రెండు నెలల్లో పార్లమెంట్ ఎలక్షన్స్ ఉన్న తరుణంలో ఇప్పుడు సీబీఐ నోటీసులతో హడావుడి చేయడం చర్చనీయాంశంగా మారింది. దీంతో ఇప్పుడైనా కవితను అరెస్ట్ చేస్తారా? లేదా? ఇదంతా బీజేపీ గేమ్ ప్లాన్ లో భాగమా అన్న ప్రశ్న తలెత్తుతోంది. ఇక తాజాగా బండి సంజయ్ స్వరం మార్చడంతో చాలా అనుమానాలే రేకెత్తుతున్నాయి. అసలు

మిగతా 3వ పేజీలో...




RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

# ఛత్తీస్‌గఢ్ లో భారీ ఎన్‌కౌంటర్ ..

## నలుగురు మావోయిస్టుల హతం

ఛత్తీస్‌గఢ్ - ప్రభాతసూర్యుడు : ఛత్తీస్‌గఢ్ లో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. బీజాపూర్ జిల్లా చోటే తుంగాలి అటవీ ప్రాంతంలో పోలీసులు, మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో నలుగురు మావోయిస్టులు ప్రాణాలు కోల్పోయారు. అటవీ ప్రాంతంలో డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్స్ సీఆర్‌పీఎఫ్ జవాన్లు మంగళవారం సంయుక్త ఆపరేషన్ చేపట్టారు. ఈ క్రమంలో వారికి మావోయిస్టులు తారసపడ్డారు. ఈ క్రమంలో పోలీసుల నుంచి తప్పించుకునేందుకు మావోయిస్టులు కాల్పులు జరిపారు. పోలీసులు సైతం ఎదురుకాల్పులకు దిగి నలుగురు మావోయిస్టులను మట్టుపెట్టారు. ఘటనాస్థలం నుంచి భారీగా ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో ఇంకా గాలింపు కొనసాగుతోంది.





# పోయింది అధికారమే పోరాట పటిమ కాదు

## కల్వకుంట్ల తారక రామారావు

ఇబ్రహీంపట్నం -ప్రభాత సూర్యుడు: ఇబ్రహీంపట్నం నియోజకవర్గం మన్నెగూడలోని వేద కన్వెన్షన్ హాల్లో మంగళవారం రంగారెడ్డి బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి అధ్యక్షతన బిఆర్ఎస్ పార్టీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిందన్నారు. కాంగ్రెస్ పార్టీ రైతు డిక్లరేషన్, ఎస్సీ డిక్లరేషన్, మైనార్టీ డిక్లరేషన్ , మహిళా డిక్లరేషన్ అని చెప్పి ప్రజలను మోసం చేసింది అన్నారు. కాంగ్రెస్ పార్టీ 100 రోజుల్లో పథకాలు అమలు చేయకపోతే కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టడం ఖాయమన్నారు. కార్యక్రమంలో. మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాల యాదయ్య, షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే, అంజయ్య యాదవ్, ఎమ్మెల్సీ ఎగం మల్లేశం, రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి, వివిధ మండలాల జెడ్పీటీసీలు, ఎంపీపీలు , వివిధ గ్రామాల అధ్యక్షులు, కార్యదర్శులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థుల శ్రేయస్సు పట్ల పిఆర్ఆర్ ఫౌండేషన్ కృషి అభినందనీయం

## యాచారం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శంకర్ కుమార్

యాచారం - ప్రభాత సూర్యుడు : పిఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో యాచారం మండల ఆదర్శ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ నిర్వహించారు . ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యాచారం సర్కిల్ ఇన్స్పెక్టర్ శంకర్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి ఇష్టంగా చదివి మంచి ఫలితాలు సాధించాలని వివిధ రంగాలలో వివిధ హోదాలో ఉన్నటువంటి ప్రతి ఒక్కరు ప్రభుత్వ పాఠశాలలో చదివి ఉన్నతమైన స్థానంలో స్థిరపడిన వారిని విద్యార్థులకు తొలిమెట్టు పదవ తరగతి ని ఆయన అన్నారు. చదువుకు పేదరికం అడ్డు కాదని లక్ష్యం మనకుంటే గమ్యం చేరవచ్చని అంతరిక్షాలకి వెళ్లిన విద్యార్థులు కూడా పేదవారె కుటుంబాలను చూసి పట్టుదలతో సాధించిన వారేనని విద్యార్థులు జ్ఞానాన్ని సంపాదిస్తే ఎక్కడికి వెళ్ళినా ఎలాగైనా మన కాళ్ళ మీద మనం నిలబడవచ్చునని ఆయన అన్నారు. విద్యార్థులు చెడు అలవాట్లకు చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా మంచి మార్గం వైపు శ్రద్ధగా అడుగులు వేస్తూ జీవితాన్ని మలుచుకోవాల్సిన బాధ్యత విద్యార్థుల పైన ఉందన్నారు. పి ఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్ చెల్లం పాండురంగారావు మారుమూల గ్రామంలో ఉన్నటువంటి పేద విద్యార్థుల కోసం ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో మరెన్నో సేవలు చేపట్టి విద్య, వైద్య, అభివృద్ధికి పి ఆర్ ఆర్ ఫౌండేషన్ కృషి చేయాలని ఆయన అన్నారు. దీంతోపాటు పెరుగుతున్న విష సంస్కృతి పై మద్యం డ్రగ్స్ వంటి వాటిపై సాంస్కృతిక కళల ద్వారా సమాజాన్ని చైతన్యవంతం చేయాలని ఆయన అన్నారు. అనంతరం ఆయన చేతుల మీదుగా విద్యార్థులకు లాస్ట్ మినిట్ రివిజన్ బుక్ మెటీరియల్ అందించారు. ఈ కార్యక్రమంలో పి ఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్ చెల్లం పాండురంగారావు, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ అమీనా, రాములు, కోటేష్, ముత్తయ్య ,ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# లైఫ్ సైన్సెస్‌కు హైదరాబాద్ కేరాఫ్

మొదటిపేజీ తరువాయి..

ఆకాశమే మీ లక్ష్యమైతే మేం రాకెట్ తో సిద్ధం' అని ఫార్మా కంపెనీలకు సీఎం పిలుపునిచ్చారు. 21 ఏళ్ల క్రితం బయో ఆసియా సదస్సు ప్రయాణం మొదలైందని, జీవ వైద్య రంగంలో అద్భుత ఆవిష్కరణలకు ఇది మంచి వేదకని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. 'పారి శ్రామిక వేత్తలకు ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సాహం అందిస్తోంది. దేశంలో ఎక్కడా లేని విధంగా నూతన జీవ వైద్య విధానాన్ని అందుబాటులోకి తీసుకొస్తాం. కేవలం పరిశ్రమల స్థాపనే కాకుండా సాంకేతిక పరిజ్ఞానంతో ఉద్యోగాల కల్పన చేసే విధంగా పాలసీ రూపొందిస్తాం. విద్యార్థులకు చదువుతో పాటు ఆయా రంగాల్లో నైపుణ్యం సాధించేలా తగిన శిక్షణ ఇచ్చే విధానం తీసుకొస్తాం. రాష్ట్రాన్ని నైపుణ్య శిక్షణ కేంద్రంగా మార్చేలా సీఎం రేవంత్ రెడ్డి ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ సదస్సులో ఓ విదేశీ కంపెనీ, బయోలాజికల్ ఈ సంస్థ మధ్య ఒప్పందం కుదిరింది. 50 మిలియన్ డోసుల డెంగ్యూ వ్యాక్సిన్ కోసం ఈ ఒప్పందం కుదుర్చుకున్నారు. ఐటీ రంగ అభివృద్ధికి తోడ్పడుతున్న ట్లు గానే ఫార్మా, ఎంఎస్ఎంఈల అభివృద్ధికి కృషి చేస్తాం. ఐటీలో మారుతున్న పరిణామాలకు అనుగుణంగా లైఫ్ సైన్సెస్ పాలసీ తీసుకొస్తాం. రాబోయే రోజుల్లో తెలంగాణ హ్యూమన్ రిసోర్స్ సెంటర్‌గా మారనుంది.' అని పేర్కొన్నారు. ప్రపంచ ఆర్థిక సదస్సులో తెలంగాణకు రూ.40వేల కోట్లకుపైగా పెట్టుబడులు వచ్చాయని కొత్త ప్రభుత్వంపై పెట్టుబడిదారులకు ఉన్న నమ్మకానికి ఇదే నిదర్శనమని తెలిపారు.



### జీనోమ్ 2 కు మేం రెడీ

మూడు వందల ఎకరాల్లో రూ.2000 కోట్ల పెట్టుబడులతో జీనోమ్ వ్యాలీ ఏర్పాటు చేస్తాం. లక్ష కోట్ల పెట్టుబడులతో పది ఫార్మా విలేజీలను ఏర్పాటు ప్రక్రియ ఇప్పటికే మొదలైంది. దీంతో మౌలిక సదుపాయాలతో పాటు ఔత్సహిక పారిశ్రామికవేత్తలకు అపారమైన అవకాశాలు అందుబాటులోకి వస్తాయి. 5 లక్షల మందికి కొత్త ఉద్యోగాలు లభిస్తాయి. వికారాబాద్, మెదక్, నల్గొండ జిల్లాల్లో గ్రీన్ ఫీల్డ్ ఫార్మా సెక్టార్లలో ఈ ఫార్మా విలేజ్ లను ఏర్పాటు చేస్తాం. హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఒక గంట ప్రయాణ దూరంలోని అత్యంత సమీపంలో వీటిని ఏర్పాటు చేస్తున్నందున ప్రపంచంలోని పారిశ్రామికవేత్తలందరికీ ఎంతో సదుపాయంగా ఉంటుంది' అన్నారు.కోవిడ్ తర్వాత ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్యానికి సంబంధించిన ఆందోళనలున్న పరిస్థితుల్లో హైదరాబాద్ వేదికగా జరుగుతోన్న బయోఏషియా సదస్సు కీలకంగా మారిందని ముఖ్యమంత్రి అన్నారు. బయోసైన్స్ రాజధానిగా హైదరాబాద్ నేడు యావత్ మానవాళికి ఒక భరోసాగా నిలిచిందని అన్నారు. వైరస్ భయాలను ధీటుగా ఎదుర్కోగలమనే నమ్మకాన్ని హైదరాబాద్ కలిగించిందని, ఇప్పుడు ప్రపంచంలో వినియోగించే ప్రతి మూడు వ్యాక్సిన్లలో ఒకటి హైదరాబాద్ లోనే ఉత్పత్తి అవుతోందని గుర్తు చేశారు.ఆరోగ్య భద్రత విషయంలో ప్రపంచంలోని అందరి సమస్యలు ఒకేలా ఉన్నాయని కోవిడ్ నిరూపించిందని, అయితే సమస్యల పరిష్కారాలను కూడా మనం కలిసికట్టుగానే సాధించాలని సీఎం సూచించారు. ఒక్క బయో సైన్సెస్ లోనే కాదు, ఐటీ-సాఫ్ట్ వేర్, రీసెర్చ్, స్టార్టప్ రంగాలకు రాజధానిగా ఉన్న హైదరాబాద్ ను మరింత సమున్నతంగా తీర్చిదిద్దేందుకు తమ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. అంతర్జాతీయ, దేశీయ సంస్థలు ఇక్కడ ఎలాంటి ఆటంకాలు లేకుండా కార్యకలాపాలు నిర్వహించేందుకు అవసరమైన అనుకూల వ్యవస్థలను బలోపేతం చేశామన్నారు. చిన్న స్టార్టప్ లు, పెద్ద కార్పొరేట్ కంపెనీలకు వారధిగా నిలిచే ఎంఎస్ఎంఈ రంగానికి తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యతను ఇస్తుందన్నారు."మీరు నింగిలోని తారల వద్దకు చేరాలని కలలు కంటే.. మిమ్మల్ని అక్కడికి తీసుకెళ్లే రాకెట్ లా మా ప్రభుత్వం పనిచేస్తుంది" అని సీఎం వ్యాఖ్యానించారు. ఇటీవల దావోస్ వేదికగా జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సులో తెలంగాణకు భారీ స్థాయిలో రూ.40,232 కోట్ల పెట్టుబడులు వచ్చాయని గుర్తు చేశారు. ఏటా 5కోట్ల డోసుల వ్యాక్సిన్ల ఉత్పత్తే లక్ష్యంగా ప్రఖ్యాత టకేడా సంస్థ ఇక్కడి బయోలాజికల్-ఈ సంస్థతో కలిసి హైదరాబాద్ లో తయారీ కేంద్రం నెలకొల్పడాన్ని స్వాగతించారు.

# గెలుపోటములు సమానంగా స్వీకరించాలి



## మల్‌రెడ్డి అభిషేక్ రెడ్డి, కొంగర విష్ణువర్ధన్ రెడ్డి

మంచాల - ప్రభాత సూర్యుడు : మంచాల మండల పరిధి లోని ఆరుట్ల గ్రామంలో శ్రీవేణుగోపాల స్వామి జాతర సందర్భంగా యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహిం చిన గ్రామస్థాయి క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహు మతుల ప్రదానోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి, రాష్ట్ర నాయకులు కొంగర విష్ణు వర్ధన్ రెడ్డి హాజరై బహుమతులు అందించారు. మొదటి బహుమతి రూ.20వేలు యువసేన యూత్ స్పాన్సర్ సుంకరి జయంత్ గౌడ్, రెండవ బహుమతి రూ.15 వేలు శ్రీరామ్ యూత్ స్పాన్సర్ వేదిరే వెంకట రమణా రెడ్డి, మూడవ బహుమతి రూ.10వేలు పాండవ సేన స్పాన్సర్ గుడ్డిమల్ల చంద్రయ్య, నాలుగవ బహుమతి రూ.5వేలు పాండవసేన స్పాన్సర్ మార సురేష్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ రూ.2222 జి.పవన్ కుమార్ స్పా న్సర్ ఎన్నుదుల సురేష్, బెస్ట్ బ్యాట్స్మెన్: సపవట్ గణేష్, బెస్ట్ బౌలర్ ఎండి అదిల్ నిలిచారు. యూత్ కాంగ్రెస్ ఆర్గనైజర్స్ టీ షర్ట్స్ స్పాన్సర్ మదగొని మాసయ్య గౌడ్ బహుమతులు క్రీడాకారులకు అందించారు. కార్యక్రమంలో ఎంపిటిసి కావాలి శ్రీనివాస్ ముదిరాజ్,గ్రామ శాఖ అధ్యక్షులు భాషయ్య, పిఎసిఎస్ డైరెక్టర్ హనుమంత్ రెడ్డి, కిసాన్ సెల్ అధ్యక్షులు బుగ్గ రాములు ముదిరాజ్, నూకం సుధాకర్, కంబాలపల్లి బుగ్గరాములు, సతిరి ఎల్లేశ్, బుట్టి కృష్ణ, అంతటి రాజు గౌడ్, జంగయ్య గౌడ్, మార లక్ష్మణ్, వస్పరి కుమార్, తలారి కృష్ణ,జంగయ్య, జి శ్రీనివాస్, సిహెచ్.శంకర్ ముదిరాజ్, జంగారెడ్డి, గోపాల్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు సురేష్ , సోషల్ మీడియా స్టేట్ కన్వీనర్ పొలమోని రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# పోనూ లేదు రానూ లేదు

మొదటిపేజీ తరువాయి..

ఇటు ఏపీ నేతలతో టచ్ లో ఉండటం లేదని తెలుస్తోంది. కనీసం ఫోన్ చేసినా కూడా స్పందించడం లేదని ఆ పార్టీ నేతలు వాపోతున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్నికల వాతావరణం తారస్థాయికి చేరింది. అక్కడ అసెంబ్లీ ఎన్నికలతో పాటు పార్లమెంట్ ఎన్నికలు కూడా జరగనున్నాయి. అధికార, ప్రతిపక్ష పార్టీలు జోరుగా ఎన్నికల ప్రచారం చేస్తున్నాయి. అభ్యర్థులను ప్రకటించి రకరకాల కసరత్తులు చేస్తున్నాయి. కానీ భారత రాష్ట్ర సమితి మాత్రం నిశ్శబ్దంగా ఉండిపోయింది. ఎందుకంటే ఆంధ్రప్రదేశ్లో పోటీ చేయకూడదని ఆ పార్టీ నిర్ణయించినట్లు తెలుస్తోంది. అయితే ఈ విషయాన్ని ఏపీలోని నేతలకు ఆ పార్టీ అధిష్టానం చెప్పలేదట. ఈ విషయం తెలియకుండా ఆ పార్టీ నేతలు కేసీఆర్ ను కలవాలని ఎంత ప్రయత్నించినా కుదరడం లేదని తెలుస్తోంది. ఇక ఏపీలోని భారత రాష్ట్ర సమితి నేత రావెల కిషోర్ బాబు చాలా రోజుల క్రితమే వైసీపీలో చేరారు. తోట చంద్రశేఖర్ మాత్రమే ఉన్నారు. ఆయన ఏపీ భారత రాష్ట్ర సమితి అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఈయన కూడా త్వరలోనే భారత రాష్ట్ర సమితి అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తారని ప్రచారం జరుగుతోంది. మొత్తానికి ఈ పరిణామాలతో భారత రాష్ట్ర సమితి అధ్యాయం ఆంధ్రప్రదేశ్లో ముగియబోతుందని తెలుస్తోంది. ఆంధ్రప్రదేశ్ మాత్రమే కాదు మహారాష్ట్రలో కూడా చాలామంది నేతలు రాజీనామా చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇప్పటికే కొంతమంది నాయకులు రాజీనామా చేశారు. "ఆంధ్రప్రదేశ్లో చెప్పుకునేంత స్థాయిలో పెద్దపెద్ద నాయకులు లేరు కాబట్టి అక్కడ హడావిడి ఏమీ లేదు. ఎలాగూ పోటీ చేయడం లేదు కాబట్టి అధ్యక్ష పదవి ఉన్నా ఒకటే, లేకున్నా ఒకటేనని తోట చంద్రశేఖర్ భావించి.. తన అధ్యక్ష పదవికి రాజీనామా చేసేస్తే.. ఆంధ్రప్రదేశ్లో కారు పార్టీకి కార్యాలయం కూడా ఉండదని" రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు.



# సగం మందికే ఫ్రీ గ్యాస్

మొదటిపేజీ తరువాయి..

దరఖాస్తు చేసుకోలేదు. దీంతో వీరంతా ప్రస్తుతం సబ్సిడీకి దూరం కానున్నారు. కొందరు దరఖాస్తుల్లో సబ్సిడీ విద్యుత్, గ్యాస్ ఆప్షన్ ఎంచుకోలేదు. ఈ కారణంగా కూడా దరఖాస్తు చేసుకున్నవారిలో కూడా 5 లక్షల మంది అర్హత కోల్పోయారని సమాచారం. ఆరు గ్యారంటీల్లో ప్రభుత్వం ఇప్పటికే రెండు గ్యారంటీలను అమలు చేస్తోంది. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచింది. ఆర్టీసీ బస్సుల్లో మహిళ లకు ఉచిత ప్రయాణం కల్పిస్తున్నారు. ఫిబ్రవరి 27 నుంచి 200 ఉచిత విద్యుత్, రూ.500లకే సబ్సిడీ గ్యాస్ ఇవ్వనున్నారు. అయితే ఈ రెండు పథకాలను రేషన్ కార్డు ఉన్నవారికే ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయిం చింది. రేషన్ కార్డు లేనివారు కూడా అభయహస్తంలో దరఖాస్తు చేసుకున్నారు. కానీ, రేషన్ కార్డు దారులను మాత్రమే అర్హులుగా గుర్తించారు మొదటి విడత అభయ హస్తం దరఖాస్తులు వారం రోజులు స్వీకరించారు. ఆ సమయంలో చాలా మంది వివిధ కారణాలతో దరఖాస్తు చేసుకోలేదు. ఈ కారణంగా 50 లక్షల రేషన్‌కార్డుదారులు రూ.500 సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌కు దూరం అవుతున్నారు. అయితే రెండో విడత కూడా దరఖాస్తులు స్వీకరిస్తా మని, అభయహస్తం నిరంతర ప్రక్రియ అని సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా ప్రకటించారు. దీంతో రెండో విడత ఎప్పుడు ప్రారంభిస్తారో అని మొదటి విడత దరఖాస్తు చేసుకోని వారు నిరీక్షిస్తున్నారు. త్వరగా దరఖాస్తులు స్వీకరించాలని కోరుతున్నారు.



RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

# పదిమందిపై డ్రగ్స్ కేసు



**హైదరాబాద్ - ప్రభాతసూర్యుడు :**
రాడిసన్ డ్రగ్ కేసు లో పదిమంది వీఐపీ ల పై కేస్ నమోదు చేసారు పోలీసులు. రాడిసన్ డ్రగ్ పార్టీలో ఎఫ్ ఆర్ లో కీలక విషయాలు పొందుపరిచారు. ఇద్దరు అమ్మాయితో పాటు తొమ్మిది మందిపై చ్చిబౌలి పోలీసులు. కేసు నమోదు చేసారు. వ్యాపారవేత్తలు గజ్జల వివేకానంద్.. అబ్బాస్ పై కేసు నమోదు అయింది. డ్రగ్స్ సేవించినవారు నిర్భయ తో పాటు రఘు చరణ్ పై కేసు నమోదు చేసారు. వ్యాపారవేత్తలు కేదార్ తో పాటు సందీప్ పై కేసు నమోదుచేసారు. సెలబ్రిటీ శ్వేతా తో పాటు లిశి పై కేసు నమోదు అయింది. పదిమంది కలిసి డ్రగ్ తీసుకున్నట్లు, బయట నుండి అబ్బాస్ డ్రస్ వచ్చినట్లు, కొకైన్ పేపర్ రోల్ లో చుట్టి తీసుకున్నట్లు, డ్రగ్స్ పార్టీలో మరికొంతమంది ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.



# బీజేపీ నేత ప్రభాకర్‌కు దీపాదాస్ లీగల్ నోటీసులు

**హైదరాబాద్ - ప్రభాతసూర్యుడు :**
బీజేపీ నేత ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్‌కు కాంగ్రెస్ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ షాక్ ఇచ్చారు. ప్రభాకర్‌కు ఆమె లీగల్ నోటీసులు పంపారు. ఇటీవల ఎన్‌వీఎస్ ప్రభాకర్ కాంగ్రెస్ నేతల నుంచి బెంజ్‌కారు లబ్ధి పొందినట్లు ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆమె ఎలాంటి ఆధారాలు లేకుండా నిరాధార ఆరోపణలు చేశారని ఆరోపించారు. ఆరోపణలపై రెండు-రోజుల్లో ఆధారాలు చూపించాలని డిమాండ్ చేశారు. లేకపోతే రూ.10కోట్లకు పరువు నష్టం దావా చేయనున్నట్లు దీపాదాస్ మున్షీ హెచ్చరించారు. తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జ్‌గా ఉన్న మాణిక్‌రావు ఠాక్రే స్థానంలో దీపాదాస్ మున్షీని డిసెంబర్‌లో కాంగ్రెస్ నాయకత్వం నియమించింది.అయితే, త్వరలో పార్లమెంట్ ఎన్నికలు జరుగనున్న విషయం తెలిసిందే. ఎంపీ టికెట్ ఆశావాహుల్లో ఒకరు దీపాదాస్ మున్షీకి బెంజ్ కార్‌ను బహూకరించినట్లు ఆరోపించారు. దీపాదాస్‌కు బెంజ్ కారు కొనివ్వడంపై తనవద్ద పక్కా సాక్ష్యాధారాలు ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. ఎంపీ టికెట్ కోసం ఆమె ఎవరు కారును గిఫ్ట్‌గా ఇచ్చారన్నది మాత్రం ఆయన వెల్లడించలేదు. దీపాదాస్ మున్షీపై తాను చేసిన ఆరోపణలకు కట్టుబడి ఉన్నానని ఆయన ఇప్పటికే స్పష్టం చేశారు. దీపాదాస్ మున్షీ, ఆమెకు గిఫ్ట్ ఇచ్చిన నేతలు స్పందిస్తేనే తాను సమాధానం చెబుతానని, ఆధారాలు చూపిస్తానన్నారు. ఈ క్రమంలోనే తనపై చేసిన ఆరోపణలపై దీపాదాస్ మున్షీ బీజేపీ నేతకు లీగల్ నోటీసులు పంపారు.

# గగన్‌యాన్ వ్యోమగాముల ప్రకటన

**తిరువనంతపురం, ప్రభాతసూర్యుడు :**
అంతరిక్ష రంగంలో ప్రపంచ దేశాల సరసన భారత్( సగర్వంగా తలెత్తుకుని నిలబడుతున్న విషయం తెలిసిందే. అనేక ప్రయోగాల్లో భారత్.. అమెరికా, చైనాసహా పలు దేశాలకు దీటుగా దూసుకుపోతోంది. చంద్రయాన్‌వంటి కీలక ప్రయోగాలతో ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షించింది. అయితే.. మానవులను అంతరిక్షంలోకి పంపించడం అనేది మాత్రం ఇప్పటి వరకు భారత్‌కు సాధ్యం కాలేదు. ఈ నేపథ్యంలో గత మూడేళ్లుగా భారత అంతరిక్ష పరిశోధన సంస్థ( ఆ దిశగా దృష్టి పెట్టింది. ఈ క్రమంలో మిషన్ 'గగన్‌యాన్'ను ప్రకటించింది. దీనికి కేంద్ర ప్రభుత్వం గత ఏడాదిన్నర కిందటే గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో యుద్ధ ప్రాతిపదికన ఇస్రో తన వ్యూహాన్ని కార్యాచరణలోకి తీసుకువచ్చింది. ఈ ప్రయోగం వాస్తవానికి ఈ ఏడాది చివరి నాటికే చేపట్టాల్సి ఉంది. అయితే.. కొన్ని కారణాలతో దీన్ని వచ్చే ఏడాదికి వాయిదా వేశారు. దేశం సగర్వంగా భావిస్తున్న గగన్‌యాన్ ప్రయోగం ద్వారా.. అంతరిక్షంలోకి వెళ్లే.. వ్యోమగాములను ఇప్పటికే ఎంపిక చేశారు. తాజాగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వారి పేర్లను ప్రకటించారు. కేరళలో పర్యటిస్తున్న ప్రధాని మోడీ.. తిరువనంతపురంలో జరిగిన కార్యక్రమంలో ప్రధాని వారిని పరిచయం చేస్తూ.. స్టాండింగ్ ఒవేషన్‌తో సత్కరించారు.

**ఆ నలుగురూ వీరే**

1) ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్
2) అంగద్ ప్రతాప్
3) అజిత్ కృష్ణన్
4) వింగ్ కమాండర్ సుభాన్షు శుక్లాలు వ్యోమనౌకలో అంతరిక్షంలోకి వెళ్లనున్నారు. వీరంతా కూడా భారత వాయుసేనకు చెందిన గ్రూప్ కెప్టెన్లు కావడం, సుదీర్ఘ అనుభవం(12 సంవత్సరాల పైబడి) ఉండడంతో వీరిని అన్ని కోణాల్లోనూ పరీక్షించి ఎంపిక చేశారు. వీరి పేర్లను తాజాగా ప్రధాని మోదీ స్వయంగా ప్రకటించారు. కాగా, భారత నేల నుంచి స్వదేశీ వ్యోమనౌకలో అంతరిక్షంలోకి వెళ్లనున్న మొదటి భారతీయ బృందంగా వీరు ఘనత దక్కించుకోనున్నారు. తిరువనంత పురంలో జరిగిన కార్యక్రమంలో ప్రధాని మోడీ మాట్లాడారు. 'విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ నుంచి మరొక చరిత్రాత్మక



ప్రయాణాన్ని వీక్షించనున్నాం. ఈ రోజు నలుగురు వ్యోమగాములు భారత్‌కు పరిచయమయ్యారు. ఇవి నాలుగు పేర్లు కాదు. 140 కోట్ల మంది భారతీయుల ఆకాంక్షలను అంతరిక్షంలోకి తీసుకెళ్లే శక్తులు. 40 ఏళ్ల తర్వాత మరోసారి భారతీయుడు అంతరిక్షంలోకి వెళ్తున్నాడు. అయితే ఈసారి కౌంట్‌డౌన్ మనదే. రాకెట్ మనదే' అంటూ ప్రధాని వారిని కొనియాడారు. ఇక, మూడో ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించబోతున్న తరుణంలో.. గగన్‌యాన్ మన అంతరిక్ష రంగాన్ని సరికొత్త శిఖరాలకు చేర్చనుందని ప్రధాని తెలిపారు. ఈ రంగంలో భారత 'నారీ శక్తి' కీలక పాత్ర పోషించిందని వెల్లడించారు. మహిళా శాస్త్రవేత్తలు లేకుండా చంద్రయాన్, గగన్‌యాన్ వంటి మిషన్‌లను ఊహించుకోలేమన్నారు. ఇదిలావుంటే.. భారత అంతరిక్ష రంగంలో 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు అనుమతి ఇచ్చిన విషయం తెలిసిందే. దీంతో ఇలాంటి ప్రయోగాలు మరిన్ని పెరిగే అవకాశం ఉందని ప్రధాని పేర్కొన్నారు.

**గతంలోనూ..**

గతంలో కూడా రాకేశ్‌శర్మ భారత్ తరఫున అంతరిక్షంలోకి వెళ్లారు. క్షేమంగా తిరిగి వచ్చారు.అంతేకాదు.. భారత్ నుంచి అంతరిక్షంలోకి వెళ్లిన తొలి వ్యోమగామిగా రికార్డు సాధించారు. కానీ, ఆయన భారతీయుడే అయినా.. ఆయన పాల్గొన్న ప్రయోగం.. మాత్రం రష్యా చేపట్టింది. అప్పట్లో భారత్ అనుమతి మేరకు రాకేశ్ శర్మ అంతరిక్షానికి వెళ్లి వచ్చారు. కానీ, ఇప్పుడు తొలిసారి భారత అంతరిక్ష పరిశోధన సంస్థ చేపట్టిన యాత్రద్వారా.. భారతీయులు వెళ్తుండడం గమనార్హం.

## రష్యా శిక్షణలో..

భారత్ నుంచి అంతరిక్షంలోకి వెళ్లనున్న నలుగురు వ్యోమగాములకు కొద్దికాలం రష్యాలో శిక్షణ ఇచ్చారు. మాస్కోతో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు రష్యా అంతరిక్ష సంస్థ రోస్‌కాస్మోస్ వారిని సుశిక్షితులను చేసింది. ప్రస్తుతం స్వదేశంలో ఇస్రో వారిని మరింతగా తీర్చిదిద్దుతోంది. 2025లో జరిగే ఈ యాత్ర కోసం వారు నిరీక్షిస్తున్నారని గతంలో ఇస్రో ఛైర్మన్ ఎస్.సోమనాథ్ అన్నారు. వారిని రోదసిలోకి పంపి, మూడు రోజుల తర్వాత భూమికి తీసుకురావడం ఈ యాత్రలో కీలకాంశమని తెలిపారు. ఈ మిషన్ సాంతం వారు ఎలాంటి అస్వస్థతకు గురికాకుండా చూసేందుకు శారీరక దృఢత్వం కోసం శిక్షణ ఇచ్చారు.

# మార్చి 1న చలో మేడిగడ్డ

**మొదటిపేజీ తరువాయి..**
మాట్లాడుతున్న వారికి సజీవంగా చూపెట్టాలని మేడిగడ్డకు బయలుదేరి వెళ్తున్నాం. కేసీఆర్ నల్లగొండ బహిరంగ సభలోనే స్పష్టంగా చెప్పారు. మీరు వెళ్లడం కాదు.. మేడిగడ్డకు.. అన్నారం వెళ్తాం.. సుందిళ్ల వెళ్తాం.. మొత్తం కాళేశ్వరం ప్రాజెక్టు సమగ్ర స్వరూపాన్ని ప్రజలకు అర్థమయ్యేలా సజీవంగా చూపెడతాం. కాళేశ్వరం అంటే మేడిగడ్డ కాదు మూడు బరాజ్‌లు. కాళేశ్వరం అంటే 15 రిజర్వాయర్లు, 21 పంప్‌హౌస్‌లు, 203 కిలోమీటర్ల సొరంగాలు, 1531 కిలోమీటర్ల ప్రవాహ కాలువలు. కాళేశ్వరం అంటే 141 టీఎంసీల స్టోరేజ్ కెపాసిటీ..240 టీఎంసీల వినియోగం. వీటన్నింటి సమగ్ర సమాహారమే కాళేశ్వరం ప్రాజెక్టు' అని తెలిపారు.

**చిల్లర మాటలు మాట్లాడుతున్నరు..**

'రూ.లక్షకోట్ల విలువైన ప్రాజెక్టు అని ఒక వైపు చెబుతూ.. రూ.లక్షకోట్లు కొట్టుకుపోయిందని ఓవైపు చిల్లర మాటలు మాట్లాడుతూ.. రూ.3వేలకోట్ల బరాజ్‌ను అందులో 84 పిల్లర్లు ఉంటే.. మూడు పిల్లర్లకు ప్రమాదం వస్తే మొత్తం బరాజ్ కొట్టుకుపోయిందన్నట్లు చిత్రీకరించే ప్రయత్నం చేస్తారు. కాళేశ్వరం అంటే మేడిగడ్డ కాదు. అన్నింటికి మించి 40లక్షలకుపై చీలుకు ఎకరాలకు నీర్చి కామధేనువు కాళేశ్వరం. 88 మీటర్ల ఎత్తు నుంచి సముద్రమట్టం మీద 618 మీటర్ల ఎత్తుకు గోదావరి గంగను పైకి ఏటికి ఎదురీదుతూపైకి తీసుకొని పోయే



బృహత్తర కార్యక్రమం కాళేశ్వరం. తెలంగాణ టోపోగ్రఫీకి తెలిసిన వారికి తెలుస్తుంది. తెలంగాణ దాదాపు ఒక గుడిసెలా ఉంటుంది. మధ్య హయ్యర్ ప్లాటో ఉంటే ఒక వైపు కృష్ణ, ఒక వైపు గోదావరి ప్రవహిస్తుంటుంది. పైన 535 మీటర్లపైన హైదరాబాద్ లాంటి పట్టణం ఉంది. కొండపోచమ్మసాగర్ ప్రాంతం 618 మీటర్లు ఎత్తు ఉంది. లక్ష్మీదేవిపల్లి, షాద్‌నగర్ ఏరియాలో658 మీటర్లు. ఏటవాలుగా ఉండే పరిస్థితి తెలంగాణది' అన్నారు.

**భగీరథ ప్రయత్నమే కాళేశ్వరం..**

'తెలంగాణ టోపోగ్రఫీ, దాని పరిస్థితి తెలిసిన వారు ఎవరైనా తెలుసుకునేది ఏంటంటే.. దిగువన పారుతున్న గోదావరిని ఎగువకు రప్పించేందుకు చేసిన భగీరథ ప్రయత్నమే కాళేశ్వరం. తెలంగాణ రాష్ట్రానికి, రైతాంగానికి కామధేనువు కాళేశ్వరం. తెలంగాణను కరువు నుంచి గట్టెక్కించే కామధేనువు కాళేశ్వరం. తాగు, సాగునీటి ఇబ్బందులు లేకుండా చేసే కామధేనువు. ఈ ప్రాజెక్టు కాకుండా చేయాలని ఎన్నో కేసులు వేశారు. కేసీఆర్‌కు మస్త్ పేరొస్తది.. తెలంగాణ దశాబ్దాలు పడ్డ కష్టం తీరిస్తే కేసీఆర్ ప్రజల గుండెల్లో మిగిలిపోతడదని.. ఎన్నో కేసులు వేసిన తర్వాత వాటిని అధిగమించి 400పైగా అనుమతులు సాధించి.. గోదావరి గంగను మన పొలాల్లో ఒప్పొంగేలా చేసింది ఆ నాడు కేసీఆర్ నాయకత్వం.నాటి ప్రభుత్వం మీకు నీళ్లు రావు.. దశాబ్దాల పాటు జరిగిన మోసం ఏది ఉందో.. దానికి ముగింపు పలికి గోదావరిలో మన వాటా మనం తీసుకునే స్థాయికి.. కాళేశ్వరం ప్రాజెక్టుతో మన హక్కులను కాపాడుకున్నాం. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును తెలంగాణ ఉద్యమం దెబ్బకు జడిసి జలయజ్ఞంలో ఆదరాబాదరగా పెట్టారు. ప్రాణహిత, తుమ్మిడిహట్టి నుంచి హైదరాబాద్ పక్కనే ఉండే చేవెళ్లకు నీళ్లు తెస్తమని నమ్మబలికి ఆ నాడు ప్రాజెక్టు డిజైన్ చేశారు. ఎక్కడి చేవెళ్ల, ఎక్కడి తుమ్మిడిహట్టి.. అక్కడి నుంచి ఇక్కడికి నీళ్లు తీసుకువచ్చే ప్రాజెక్టులో ఆ నాడు. స్టోరేజ్ అనే కాన్సెప్ట్ లేదు' అని విమర్శించారు.

# కవితకు షాక్ తప్పదా?

**మొదటిపేజీ తరువాయి..**
గతంలో ఎప్పుడూ కవితను అరెస్ట్ చేస్తామని బీజేపీ చెప్పలేదు. ఈడీ, సీబీఐలతో బీజేపీకి సంబంధాలుండవని బండి ఇప్పుడు చెప్పడం వెనుక కొత్త స్ట్రాటజీ ఏమైనా ఉందా అనే అను మానాలు మొదలయ్యాయి మరోవైపు ఇప్పుడు కాని కవితను అరెస్ట్ చేస్తే బీఆర్ఎస్ కు సాను భూతి పవనాలు వీచడం ఖాయవనే టాక్ విని పిస్తోంది. ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో కేజ్రీవాల్ కు ఈడీ 7 సార్లు సమన్లు ఇచ్చింది. అయితే వాటి బేఖాతరు చేస్తూ వస్తున్న కేజ్రీవాల్ కేం ద్రంపై రివర్స్ ఫైట్ కు దిగారు. కవిత కూడా ఈడీ మహిళలను కార్యాలయానికి పిలిచి విచా రించడమేంటని.. సుప్రీంలో సవాలు చేసింది. దాన్ని అడ్డుగా పెట్టుకున్న కవిత ఆ తీర్పును బట్టి తాను సీబీఐ విచారణకు హాజరు అవుతా నని ఇప్పుడు మెలిక పెట్టింది. ఈ నేపథ్యంలో కేంద్రం చేతిలో దర్యాప్తు సంస్థలు కీలుబొమ్మ లుగా మారాయనే వాదనకు బలం చేకూరుతోంది. మొత్తంగా ఈ కేసులో ఏదో ఒక నిర్ణయం వెలువడేదాకా ఉత్కంఠ కొనసాగనుంది.



# నేటి నుంచి ఇంటర్ పరీక్షలు



## నిమిషం నిబంధన అమలు

**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :**
తెలంగాణ వ్యాప్తంగా బుధవారం నుంచి ఇంటర్ వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. మార్చి 19 వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్షలకు సంబంధించిన హాల్‌టికెట్లను ఇంటరోబోర్డు ఇప్పటికే అందుబాటులో ఉంచినసంగతి తెలిసిందే. వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఆయాతేదీల్లో ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ ఏడాది ఇంటర్ పరీక్షలకు మొత్తం 9,80,978 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వీరిలో 4,78,718 మంది విద్యార్థులు పరీక్షలు రాయనుండగా.. ద్వితీయ సంవత్సరం నుంచి 5,02,260 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. సెకండియర్ పరీక్షలకు హాజరయ్యే వారిలో 58,071 మంది ప్రైవేట్ విద్యార్థులున్నారు. ఇంటర్ వార్షిక పరీక్షలకు నిమిషం ఆలస్యమైనా అనుమతించబోమని అధికారులు తెలిపారు.పరీక్షల నిర్వహణ కోసం రాష్ట్రవ్యాప్తంగా 1,521 సెంటర్లను అధికారులు ఏర్పాటుచేశారు. వీటిలో 880 సెంటర్లను ప్రైవేట్ కాలేజీల్లో, 407 సెంటర్లను ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో, మరో 234 సెంటర్లను గురుకులాల్లో ఏర్పాటు చేశారు. ఇక పరీక్షల కోసం 27,900 మంది ఇన్విజిలేటర్లు, విధులు నిర్వర్తించనున్నట్లు ఇంటర్ బోర్డు తెలిపింది. అన్ని జిల్లాల్లోనూ అవసరాలకు తగ్గట్టుగా ప్రభుత్వ పాఠశాలల టీచర్లు, సిబ్బందిని పరీక్షల విధుల్లోకి తీసుకొంటున్నట్టు వివరించారు. కలెక్టర్లు, పోలీసు అధికారులు పరీక్షాకేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తారు. చీఫ్ సూపరింటెండెంట్లు-1,521 మంది; ఫ్లయింగ్ స్కాడ్-75 మంది; సిట్టింగ్ స్కాడ్ - 200 మంది విధులు నిర్వహించనున్నారు.

**వెబ్‌సైట్‌లో ఇంటర్ పరీక్షల హాల్‌టికెట్లు..**

తెలంగాణలో ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల హాల్‌టికెట్లు విడుదలయ్యాయి. ఇంటర్ బోర్డు అధికారిక వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్లు అందుబాటులో ఉంచారు. మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఎస్సెస్సీ లేదా మొదటి ఏడాది హాల్‌టికెట్ నంబరుతో థియరీ పరీక్షల హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. రెండో ఏడాది వారు మొదటి సంవత్సరం లేదా రెండో ఏడాది హాల్‌టికెట్ నంబరుతో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. హాల్‌టికెట్లలో ఫొటోలు, సంతకాలు, ఇతర సవరణలు అవసరమైతే కళాశాల ప్రిన్సిపల్ దృష్టికి తీసుకువెళ్లి, సరిచేయించుకునే వెసులుబాటు ఉంటుంది.

### విద్యార్థులకు కీలక సూచనలు..

- ఇంటర్ వార్షిక పరీక్షలకు నిమిషం ఆలస్యమైనా అనుమతించరు.
- సెల్‌ఫోన్లపై కఠిన ఆంక్షలు.
- మాల్ ప్రాక్టీస్, కాపీయింగ్‌ను ప్రోత్సహించిన యాజమాన్యాలపై సెక్షన్ -25 ప్రకారం కఠిన చర్యలు.
- ప్రతీ పరీక్ష కేంద్రాల వద్ద 144వ సెక్షన్ అమల్లో ఉంటుంది.

## ప్రశాంతంగా పరీక్షలు రాయండి : ఇంటర్ బోర్డ్ కార్యదర్శి

విద్యార్థులు ఎలాంటి మానసిక ఒత్తిడికి లోనుకాకుండా పరీక్షలు రాయాలని ఇంటర్ బోర్డ్ కార్యదర్శి శృతి ఓజా సూచించారు. పరీక్షల నేపథ్యంలో ఆమె సోమవారం నాంపల్లిలోని ఇంటర్‌బోర్డు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని చెప్పారు. అన్ని శాఖలతో సమన్వయం చేసుకుని.. గతానికి భిన్నంగా పరీక్షలు నిర్వహించాలని తాము సంకల్పించినట్టు పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, డ్యూయల్‌డెస్క్ బెంచీలు వంటి వసతులు కల్పించామని తెలిపారు.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

# లోన్ యాప్‌కు యువకుడి బలి



హైదరాబాద్, ప్రభాతసూర్యుడు : తెలంగాణ రాష్ట్రంలో మరో విషాదం చోటుచేసుకుంది. లోన్ యాప్ వేధింపులకు మరో యువకుడు బలి అయ్యాడు. దుండిగల్ ఎయిరోనాటిక్ కాలేజ్ లో బీటెక్ థర్డ్ ఇయర్ చదువుతున్న శీలం మనోజ్ అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. లోన్ యాప్ ద్వారా మనోజ్ లోన్ తీసుకున్నాడు. ఇక ఈఎంఐ కట్టాల్సి ఉండగా.. మనోజ్ ఈఎంఐ చెల్లించలేక పోయాడు. దీంతో.. రంగంలోకి లోన్ యాప్ ఏజెంట్లు దిగారు. మనోజ్ ను ఈఎంఐ చెల్లించాలని వేధించడం మొదలుపెట్టారు. ఈఎంఐ కట్టడానికి కాస్త లేట్ అవుతుందని చెప్పినా ఏజెంట్లు మనోజ్ మాటలు పట్టించుకోలేదు. మనోజ్ సబంధించిన బంధువులు, పేరెంట్స్, స్నేహితులకు ఫోన్ చేశారు. మనోజ్ ఈఎంఐ చెల్లించాలని ఈఎంఐ టైం అయిపోయిందని డబ్బులు కట్టమంటే కట్టడంలేదంటూ ఫోన్ తెలిపారు. దీంతో బంధువులు, పేరెంట్స్, స్నేహితుల వద్ద నుంచి మనోజ్ కు అడిగారు.. ఈనేపథ్యంలో మనస్తాపం చెందిన మనోజ్ అందరిముందు పరువు పోయిందని భావించి ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే మనోజ్ రూం వద్దకు వెళ్లి స్నేహితులకు షాక్ తగిలింది. మనోజ్ రూంలో విగతజీవిగా పడివుండటంతో కాలేజీ యాజమాన్యానికి విషయం తెలిపారు.

## సంపాదకీయమ్..

# ముందుంది ముప్పు?

పసిఫిక్ మహాసముద్రంలో ఎల్‌నినో ఏర్పడింది. ఈ విషయాన్ని ప్రపంచ వాతావరణ సంస్థ ప్రకటించగా దీని ప్రభావం వల్ల లాటిన్ అమెరికా దేశాలతో పాటు ఇతర దేశాల్లో ఉష్ణోగ్రతలు పెరగనున్నాయి.వాతావరణంపై ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉంటుందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. రుతుపవనాల రాకకు ఇంకా మూడు నెలల సమయం వున్నప్పటికీ ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గే అవకాశం ఉందని చెబుతున్నారు. 2024లో మార్చి నుంచి మే నెలల మధ్య సూపర్ ఎల్ నినో ప్రపంచాన్ని దెబ్బతీసే సూచనలున్నాయి.అమెరికాకు చెందిన ఎన్ఓఏ(నేషనల్ ఓషెనిక్ అండ్ అట్మాస్ఫియరిక్ అడ్మినిస్ట్రేషన్) సూపర్ ఎల్ నినో వచ్చే అవకాశం ఉందిన కొద్దిరోజుల కిందట అంచనా వేసింది. మార్చి నుంచి మే వరకూ వేసవి కాలం. ఈ కాలంలోనే ఎల్ నినో అత్యంత తీవ్రస్థాయికి చేరుకునే అవకాశం ఉంది.ఎన్ఓఏ చేసిన వాతావరణ సూచనల ప్రకారం, 2024 మార్చి నుంచి మే నెలల మధ్య సూపర్ ఎల్‌నినో ప్రభావం కనిపించే అవకాశం ఉంది. తీవ్రమైన ఎల్ నినో కనిపించే అవకాశం 70 నుంచి 75 శాతం వరకూ ఉన్నట్లు అంచనా వేసింది.ఆ సమయంలో భూమధ్యరేఖ సమీపంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సగటు కంటే 1.5 డిగ్రీల సెల్సియస్ పెరిగే అవకాశం ఉంది.ప్రపంచవ్యాప్తంగా కేవలం 2 శాతం ఉష్ణోగ్రతలు పెరిగినా అది 30 శాతం కంటే ఎక్కువగా పెరిగినట్లే. 1972-73, 1982-83, 1997-98 మరియు 2015-16లోనూ ఇలాంటి పరిస్థితులు ఏర్పడినప్పుడు అనేక దేశాలు తీవ్రమైన ఉష్ణోగ్రతలు, కరవు, వరదల వంటి విపత్తులను ఎదుర్కొన్నాయి. ఎల్‌నినో అనేది పసిఫిక్ మహాసముద్రంలో ఒక రకమైన కాలానుగుణ మార్పు. ఈ ఎల్‌నినో వల్ల శీతాకాలాలు కూడా వెచ్చగా ఉంటాయి. వర్షం లేకుండా వేసవి కాలం మరింత వేడిగా మారనుంది. ఇక అవి మాత్రమే కాదు, దాని వల్ల రుతుపవనాలు కూడా బలహీనంగానే ఉన్నాయి. గత 20 ఏళ్లలో సంభవించిన కరవులన్నీ ఎల్‌నినో సంవత్సరాల్లోనే సంభవించాయని ఎంకె గ్లోబల్ పరిశోధనా నివేదిక చెబుతోన్న క్రమంలో ఈ సంవత్సరం వ్యవసాయోత్పత్తులు తక్కువగా ఉండవచ్చని అంటున్నారు. ఆహార పదార్థాల ద్రవ్యోల్బణం పెరిగే అవకాశం ఉందని పరిశోధన నివేదికలు హెచ్చరిస్తున్నాయి. అమెరికా నేషనల్ ఓషియానిక్ అండ్ అట్మాస్ఫియరిక్ అడ్మినిస్ట్రేషన్ గత ఏడాది జూన్ నుంచి డిసెంబర్ మధ్య ఎల్‌నినో ప్రభావం 55 నుండి 60 శాతం వరకు ఉంటుందని అంచనా వేసింది. **ఎల్‌నినో, లానినా అనేవి వాతావరణ పరిస్థితులకు సంబంధించినవి అనే సంగతి చాలా మందికి తెలుసు. కానీ అవి నిర్దిష్టంగా ఎందుకు ఏర్పడుతాయనే విషయం చాలా మందికి తెలియదు. నిజానికి శాస్త్రవేత్తలకు కూడా పూర్తిగా వీటి గురించి క్లారిటీ లేదనడం అతిశయోక్తి కాదు. ఎల్‌నినో అంటే వర్షాభావ పరిస్థితి కాగా, లానినా అంటే విపరీతంగా వర్షాలు కురిసే పరిస్థితి అనే ఒక్క మాటలో చెప్పే వివరణ.ఎల్‌నినో అంటే పెరూ తీరంలో ప్రతి 3 నుంచి 5 సంవత్సరాలకోసారి పసిఫిక్ జలరాశి అనూహ్యంగా వేడెక్కే స్థితి. ఎల్‌నినో అనేది ఒక స్పానిష్ (లాటిన్) పదం. లాటిన్ భాషలో ఎల్‌నినో అంటే క్రీస్తు శిశువు జననం. దీని కారణంగా భారత, ఆగ్నేయ ఆసియా దేశాల్లో రుతుపవన వ్యవస్థ దెబ్బతిని వర్షపాత పరిమాణం తగ్గుతుంది. మూడేళ్ళుగా పసిఫిక్‌పై వరుసగా లానినో పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ లానినో గత ఏడాది సెప్టెంబర్‌తో పూర్తయిపోయింది. ఇప్పుడు ఎల్‌నినో పరిస్థితులు ఏర్పడుతున్నాయి. దీంతో భారత్‌లోకి ప్రవేశించే నైరుతి రుతుపవనాలు సాధారణం కంటే తక్కువ వర్షపాతాన్ని ఇచ్చే అవకాశం ఉన్నట్టు నిపుణులు చెబుతున్నారు.** ఈ ఎల్‌నినో 2027 వరకు కొనసాగుతుందని ఐరాస వాతావరణ విభాగం హెచ్చరించింది. దీని వల్ల భారత్ సహా చాలా దేశాల్లో కరవు పరిస్థితులు ఏర్పడవచ్చని, ఉష్ణోగ్రతలు సాధారణం కంటే అధికంగా నమోదవుతాయని హెచ్చరించింది.ఎల్‌నినో పరిస్థితి ఎన్నడూ ఒకేలా ఉండదు. ప్రతి ఎల్‌నినో విభిన్నమైందే. ఒక్కోటి ఒక్కోలా ప్రభావం చూపుతుంది. ఎల్‌నినోతో వరదలు, కరవులు సంభవించడమే కాదు వాతావరణం వేడెక్కడం మరో సమస్య. పసిఫిక్ ఉపరితలం అధికంగా వేడెక్కడం వల్ల వాతావరణంలోకి పెద్ద మొత్తంలో శక్తి విడుదలవుతుంది. ఫలితంగా తాత్కాలికంగా ప్రపంచ వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఎల్‌నినో సమయంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు కావడానికి కారణమిదే.ప్రపంచంలోనే అతిపెద్దదైన పసిఫిక్ మహా సముద్రంలో బలంగా వీచే గాలులు, వాటి దిశ, ఉష్ణోగ్రత వంటి అంశాలు మొత్తం ప్రపంచ వాతావరణ పరిస్థితులను ప్రభావితం చేస్తాయవాతావరణంలో ఎల్ నినో ప్రభావం ఉన్నప్పుడే భారత్‌లో కరవు పరిస్థితులు ఏర్పడినట్లు గత అనుభవాలు చెబుతున్నాయి.అదే తరహాలో, ఈ ఏడాది ఎల్ నినో ప్రభావం ఉండనున్న నేపథ్యంలో దేశంలో కరవు పరిస్థితులు తలెత్తే అవకాశం ఉంది.భారత్‌లో వర్షపాతానికి, ఎల్ నినోకు అవినాభావ సంబంధం ఉన్నట్లు మీడియా నివేదికలతో అర్థమవుతోంది. ఎందుకంటే, 1981 నుంచి ఇప్పటి వరకూ దేశంలో తలెత్తిన కరవు పరిస్థితులు 6 ఎల్ నినోల కాలంలోనే జరిగాయి. చివరగా 2002, 2009 కరవు పరిస్థితుల సమయంలోనూ ఎల్ నినోలు చురుగ్గా ఉన్నాయి.అయితే ఇందులో ఆసక్తికరమైన విషయం ఏంటంటే, భారత్‌లో కరవు పరిస్థితులు తలెత్తినప్పుడు ఎల్ నినో దాదాపుగా యాక్టివ్‌గా ఉంది. కానీ, ఎల్ నినో యాక్టివ్‌గా ఉన్న ప్రతి ఏటా భారత్‌లో కరవు పరిస్థితులు ఏర్పడలేదు.ఉదాహరణకు, 1997 - 98లో ఎల్ నినో ప్రభావం తీవ్రస్థాయిలో ఉన్నప్పటికీ దేశంలో కరవు పరిస్థితి లేదు.ఉత్తర, దక్షిణ అమెరికా ఖండాల మధ్య విస్తరించి ఉండే పసిఫిక్ మహా సముద్రంలో ఏర్పడే ప్రత్యేక సముద్ర పవనాలు ఈ ఎల్‌నినో, లానినాలకు కారణం అవుతాయని అంచనా. పసిఫిక్ మహాసముద్రంలో, సాధారణ పరిస్థితుల్లో, గాలులు భూమధ్యరేఖ ద్వారా పశ్చిమంగా వీస్తాయి. అలా జరగడం వలన దక్షిణ అమెరికా నుండి వెచ్చని నీరు ఆసియా వైపు వస్తుంది. సముద్రపు లోతుల నుండి పైకి వచ్చే చల్లటి నీరు వెచ్చని నీటితో ప్రవహించే ఖాళీ స్థలాన్ని నింపుతుంది. అలాంటి ప్రాసెస్‌ను అప్‌వెల్లింగ్ అంటారు. ఎల్ నినో సహా లానినా ఈ పరిణామాన్ని నాశనం చేస్తాయి. మన దేశానికి లానినా ప్రభావం మంచిసూచన, అదే ఎల్‌నినో ప్రభావం ఉంటే జూన్ అక్టోబర్ మధ్య భారత దేశంలో రుతుపవనాలు ప్రభావితమవుతాయని అంటున్నారు.

# కేటీఆర్ చుట్టూ వైఫైలా ఈగో

మొదటిపేజీ తరువాయి..

డిసాస్టర్. రేవంత్‌తో డిబేట్ కోసం హరీష్ సెట్ అవుతున్నాడు. వందల యూ ట్యూబ్ ఛానెల్స్ పెట్టి రేవంత్ ని తిట్టిస్తున్నారు. కేటీఆర్ కాల్ చేస్తే ఆ పార్టీ అభ్యర్థులు పారిపోతు న్నారు. మేం ఆరు గ్యారంటీలతో పాటు స్వేచ్ఛ అనే 7వ గ్యారెంటీ ఇచ్చాం. మీ హాయాంలో ముఖ్యమంత్రికి చెప్పు చూపిస్తే ఎన్ కౌంటర్ చేయించే వాళ్ళు, రాళ్లతో కొట్టి చంపించే వాళ్ళు. కేటీఆర్ ని ముఖ్యమంత్రిగా ప్రకటిస్తే 3 సీట్లు కూడా రాకపోయేవి. అమెరికాలో ఇల్లు కొనుక్కోవడానికి కేటీఆర్ అమెరికా వెళ్ళారు. కేటీఆర్ హాయాంలో పని చేసిన ఆఫీసర్ల దగ్గర కోట్లాది రూపాయల నల్ల దనం దొరుకుతోంది. రోజా డైమండ్ రాణి. రేవంత్ ఫైటర్, జగన్ ఆక్సిడెంట్ సీఎం. నాన్న చనిపోతే సీఎం అయిన వ్యక్తులు ఉన్నారు. పులుసు వండి పెట్టావ్ కాబట్టి పులుసు పాప. రోజా ఐటం రాణి. మేడిగడ్డ కి వెళ్లి బీఆర్ఎస్ నాయకులు ఎం చేస్తారు. మేడిగడ్డ ఎలా నాశనం చేశారో చూసి వస్తారా? మేడిగడ్డ కూలిపోతే మాదే బాధ్యత అని బీఆర్ఎస్ చెప్పాలి. పనికిరానప్పుడు తీసేయడం తప్పా ఏం చేస్తారు. మూడు పిల్లర్లు ముప్పై పిల్లర్లు కాకుండా కాపడుతున్నామని అన్నారు.

# కదలని కడెం

## ముందుకు సాగని ప్రాజెక్టు పనులు




ఆదిలాబాద్, ప్రభాతసూర్యుడు : గతేడాది భారీ వర్షాలతో కడెం ప్రాజెక్టుపెద్ద ముప్పు నుండి బయటపడింది. గేట్లు సరిగ్గా పనిచేయకపోవడంతో ప్రాజెక్టు పై నుంచి వరద నీరు ప్రవహించి ప్రాజెక్టు డ్యామేజ్ కు గురైంది. ప్రస్తుతం ప్రాజెక్టులో నీటిమట్టం తగ్గడంతో అధికారులు ప్రాజెక్టుకు మరమ్మతులు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇంజినీరింగ్ చీఫ్ (ఈఎన్సీ) ప్రాజెక్టును సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. వచ్చే వర్షాకాలంలో ప్రాజెక్టుకు ఎలాంటి ముప్పు వాటిల్లకుండా వేసవిలోగా ప్రాజెక్టు గేట్లు ఇతర మరమ్మతులు చేసేందుకు ప్రణాళిక రూపొందించారు. ప్రాజెక్టుపై ఏం పనులు జరుగుతున్నాయి.? ఈ వేసవిలో కడెం ప్రాజెక్టు మరమ్మతులు పూర్తవుతాయా..? అన్న ప్రశ్నలకు సమాధానం తెలియాలంటే ఇది చదవాల్సిందే.నిర్మల్ జిల్లాలోని కడెం నారాయణ రెడ్డి ప్రాజెక్టును 1949 -1965 మధ్యకాలంలో నిర్మించారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని సుమారుగా 65 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతోంది. 2022 - 2023లో జూలైలో కురిసిన భారీ వర్షాల కారణంగా కడెం ప్రాజెక్టు గేట్లు సరిగ్గా పనిచేయకపోవడంతో ప్రాజెక్టు డ్యామేజ్‌కు గురైంది. గతేడాది జూలై నెలలో ఏకధాటిగా కురిసిన వర్షాలతో కడెం పూర్తిగా నిండి పోయింది. గేట్లు పనిచేయక ప్రాజెక్టు పైనుంచి వరద నీరు ప్రవహించింది. ప్రాజెక్టు కూలిపోతుందని దిగువ ప్రాంత ప్రజలు భయాందోళనకు గురయ్యారు. స్థానికులు హ్యాండిల్ సహాయంతో గేట్లు ఎత్తివేయడంతో వరద ఉద్ధృతి తగ్గి పెను ప్రమాదం తప్పింది. అనంతరం గేటుకు వెల్డింగ్ చేయించి నీటిని అదుపు చేశారు.ప్రస్తుతం కడెం ప్రాజెక్టులో నీటిమట్టం పూర్తిగా తగ్గుముఖం పడుతుంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 700 అడుగులు, 7.603 టిఎంసీలు కాగా.. ప్రస్తుతం 677.700 అడుగులకు చేరింది. 3.148 టీఎంసీలుగా ఉంది. రానున్న వేసవిలో నీటిమట్టం మరింతగా తగ్గుముఖం పడనుంది. గతేడాది భారీ వర్షాలతో ప్రాజెక్టు ఎడమ

**2022 - 2023లో జూలైలో కురిసిన భారీ వర్షాల కారణంగా కడెం ప్రాజెక్టు గేట్లు సరిగ్గా పనిచేయకపోవడంతో ప్రాజెక్టు డ్యామేజ్‌కు గురైంది. గతేడాది జూలై నెలలో ఏకధాటిగా కురిసిన వర్షాలతో కడెం పూర్తిగా నిండి పోయింది. గేట్లు పనిచేయక ప్రాజెక్టు పైనుంచి వరద నీరు ప్రవహించింది. ప్రాజెక్టు కూలిపోతుందని దిగువ ప్రాంత ప్రజలు భయాందోళనకు గురయ్యారు. స్థానికులు హ్యాండిల్ సహాయంతో గేట్లు ఎత్తివేయడంతో వరద ఉద్ధృతి తగ్గి పెను ప్రమాదం తప్పింది.**

కాలువకు పడిన గండి, పని చేయలేని గేట్లకూ మరమ్మతులు, గేట్ల బయట నుంచి వరద నీరు ప్రవహించే స్పిల్ వే, అప్రాన్ కొట్టుకుపోవడంతో ఆ పనులు గత కొద్దిరోజులుగా కొనసాగుతున్నాయి. ఇటీవల ఇంజినీరింగ్ చీఫ్ అనిల్ కుమార్ ప్రాజెక్టును సందర్శించారు. జిల్లా ఇంజినీరింగ్ అధికారులతో ప్రాజెక్టు గేట్లను, కోతకు గురైన కడెం ప్రాజెక్టు ఎడమ కాలువ, గేట్ల కింద అప్రాన్ పనులను పరిశీలించారు. వర్షాకాలంలోగా మరమ్మతులు పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందిస్తామని, దీనిపై అధికారులతో సమీక్షించి టెండర్ల ప్రక్రియను చేపట్టనున్నట్లు తెలిపారు. కడెం ప్రాజెక్టు 15వ నెంబర్ గేటు కౌంటర్ వెయిట్ పడిపోవడంతో కొత్త కౌంటర్ వెయిట్, రోలర్ బాక్స్‌లను తయారు చేస్తున్నారు. గేటుకు కొత్త కౌంటర్ వెయిట్ తయారు చేస్తున్నామని, దాంతో పాటు రబ్బర్ సీల్, రోలర్, పనులు సైతం పూర్తి చేసి వారం రోజుల్లో ఫిట్ చేస్తామని నిపుణులు తెలిపారు. అయితే, పనులు త్వరగా పూర్తి కావాలని స్థానికులు, రైతులు ఆకాంక్షిస్తున్నారు. వచ్చే వర్షాకాలంలో ఎలాంటి ప్రమాదం జరగకుండా ఈ వేసవిలోగా గండి పడిన ఎడమ కాలువకు, ప్రాజెక్టుపై మరమ్మతు పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.

# ఆరు గ్యారంటీలే మాకు భగవద్గీత, ఖురాన్, బైబిల్



హైదరాబాద్, ప్రభాతసూర్యుడు : ఆరు గ్యారెంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం తప్పనిసరిగా నెరవేరుస్తుందని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అభయహస్తం గ్యారెంటీల్లో భాగంగా ఇవాళ 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500లకే గ్యాస్ సిలిండర్ పథకాలను రేవంత్ రెడ్డి మంగళవారం సచివాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల ఇంట్లో వెలుగులు నింపేందుకు సోనియాగాంధీ ఆరు గ్యారంటీలను తెలంగాణ ప్రజలకు అంకితమిచ్చారని చెప్పారు. సోనియాగాంధీపై విశ్వాసంతో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు అధికారం కట్టబెట్టారన్నారు. నిజమైన లబ్ధిదారులకు, అర్హులకు పథకాలను అందించడమే ప్రజా పాలన ఉద్దేశమన్నారు. అందులో భాగంగా ఇవాళ 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500లకే గ్యాస్ సిలిండర్ పథకాలు ప్రారంభించుకుంటున్నామని చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా పథకాలను సచివాలయంలో లాంఛనంగా ప్రారంభించుకుంటున్నామని తెలిపారు. మహిళల కళ్లలో ఆనందం చూడాలనే రూ.500 గ్యాస్ సిలిండర్ పథకాన్ని ప్రారంభిస్తున్నామన్నారు. పేదలకు పథకాలు చేరేలా అధికారులు విధి విధానాలు రూపొందించారని చెప్పారు.ఆర్థిక నియంత్రణ పాటిస్తూ పేదలకు ఇబ్బంది కలగకుండా పథకాలు అమలు చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. ప్రజలకిచ్చిన హామీలు అమలు చేయడంలో తమ ప్రభుత్వం నిబద్ధతతో ఉందన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వంపై తండ్రీ కొడుకులు, మామా అల్లుళ్లు తప్పుడు ప్రచారం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. సోనియమ్మ మాట ఇచ్చారంటే అది శిలాశాసనం అన్నారు. సోనియా గాంధీ ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తామని రేవంత్ రెడ్డి చెప్పారు.పేదలు కట్టెల పొయ్యితో ఇబ్బందులు పడుతుంటే.. ఆనాడు యూపీఏ ప్రభుత్వమే దీపం పథకాన్ని ప్రవేశపెట్టిందని అన్నారు. ఇప్పుడు ఉన్న బీజేపీ ప్రభుత్వం సిలిండర్ ధరను రూ.1200 కు తీసుకెళ్లిందని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సిలిండర్ పై సబ్సిడీ ఇచ్చేందుకు ముందుకు రాలేదని.. తద్వారా వచ్చే పన్నుల ద్వారా లబ్ధి పొందాయని అన్నారు. తాజాగా తాము ఇచ్చిన హామీల్లో భాగంగా రూ.500 కే గ్యాస్ సిలిండర్ అందిస్తు?న్నట్లు చెప్పారు.ఎన్నికల్లో ఇచ్చిన పథకం ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని.. నూటికి నూరు శాతం అన్ని హామీలను అమలు చేస్తామని రేవంత్ రెడ్డి చెప్పారు. తాము తెలంగాణ ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని అన్నారు. అలాగే, ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వాళ్లకే ఈ పథకాలు వర్తిస్తాయని మరోసారి రేవంత్ రెడ్డి చెప్పారు. పేదల ఇళ్లలో వెలుగులు నింపాలనే 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నామని అన్నారు. అలాగే మహాలక్ష్మి పథకం కింద సబ్సిడీతో రూ.500 సిలిండర్ అందిస్తున్నామని చెప్పారు.ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో ఒకటైన మహాలక్ష్మిలో మరో హామీని అమలు చేసేందుకు ప్రభుత్వం ఈ ఉదయమే జీవో జారీ చేసింది. గ్యాస్ కంపెనీలకు నెలవారీగా సబ్సిడీ చెల్లిస్తామని జీవోలో ప్రభుత్వం పేర్కొంది. లబ్ధిదారులకు సబ్సిడీ డబ్బును గ్యాస్ కంపెనీలు బదిలీ చేయనున్నాయి. మూడేళ్ల సరాసరి వినియోగం ఆధారంగా సిలిండర్లు ఇవ్వనున్నారు. రేషన్ కార్డు ఉన్న వారికే ఈ పథకాన్ని వర్తింపజేయనున్నట్లు ప్రభుత్వం ఇప్పటికే చెప్పిన సంగతి తెలిసిందే. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 1.20 కోట్ల గ్యాస్ కనెక్షన్లు ఉండగా.. దాంట్లో వైట్ రేషన్ కార్డు దారులు ఉన్న కుటుంబాల సంఖ్య 89.99 లక్షలుగా ఉంది. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న తెల్ల రేషన్ కార్డుదారులకు రూ.500కే సిలిండర్ ఇవ్వనున్నారు.



# మేడారం పూజారి కన్నుమూత

వరంగల్, ప్రభాతసూర్యుడు : ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన వేడుక మేడారం జాతర పూజారి కన్నుమూశారు. ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం జాతర సమ్మక్క పూజారి అయిన సిద్ధమైన దశరథం అనా రోగ్యంతో తుదిశ్వాస విడిచారు. తెలంగాణ ప్రభుత్వం ఫిబ్రవరి 21 నుంచి 24 వరకు మేడారం జాతర ఘనంగా నిర్వహించింది. ఈ పూజా కార్యక్రమాల్లో సమ్మక్క పూజారి అయిన దశరథం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ క్రమంలో ఆయన అనారోగ్యానికి గురయ్యారు. గత నాలుగు రోజులుగా చికిత్స పొందుతున్న పూజా దశరథం మంగళవారం తుదిశ్వాస విడిచారు. పూజారి మృతితో ఆదివాసీల్లో విషాదం నెలకొంది. మేడారం భక్తులు సైతం పూజారి దశరథం మృతిపట్ల సంతాపం ప్రకటిస్తున్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నారు.మేడారం మహా జాతర ప్రధాన పూజారి సిద్దబోయిన లక్ష్మణ్ రావు 2023 అక్టోబర్‌లో కన్నుమూశారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన అక్టోబర్ మొదటి వారంలో వేకువజామున మృతి చెందారు. లక్ష్మణ్‌రావు స్వస్థలం తాడ్వాయి మండలం మేడారం. లక్ష్మణ్ రావు తన 20వ ఏట నుంచి మేడారం జాతరకు సేవలు అందిస్తున్నారు. మేడారంలో మె?త్తం 11 మంది ప్రధాన పూజారుల్లో లక్ష్మణ్‌రావు ఒకరు. కానీ అనారోగ్య సమస్యలతో చిన్న వయసులోనే పూజారి కన్నుమూశారు.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215